
స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్



జమ్మలమడుగు/కలికిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు నిర్మాణం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జిల్లా ప్రజలకు కూటమి సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక రాయితీలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూడా ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆగమేఘాలపై అప్పుడుకాదు ఇప్పుడు స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని వైఎస్ఆర్ స్టీల్ ప్లాంట్ పేరుతో శిలాఫలకం వేశారు. తర్వాత రెండోసారి స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అంతే.. అప్పటి నుంచి అక్కడ ఎలాంటి పనులు జరుగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా కడపలో జరిగిన మహానాడు కార్యక్రమంలోనూ స్టీల్‌ప్లాంట్ పనులు త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా జేఎస్‌డబ్ల్యూ జిందాల్ సంస్థవారు స్టీల్ ప్లాంట్ శిలాఫలకం వద్దకు చేరుకుని గత నెలలో పరిశీలించారు. తర్వాత అదే శిలాఫలకాన్ని జూలై 10న ఉక్కు కర్మాగారంపై ప్రభుత్వం దృష్టి సారించి కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో శిలాఫలకం వద్ద వేసిన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ మేరకు జేఎస్‌డబ్ల్యు రాయలసీమ స్టీల్‌ప్లాంటు పేరుతో ఉక్కు ఉత్పత్తి కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు రావడాన్ని స్వాగతిస్తూ 400 కిలోవాట్ల సామర్థ్యంతో డబుల్ సర్క్యూట్ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైనుతో 268 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు, ఏడాదికి గండికోట నుంచి రెండు టీఎంసీల నికర జలాలను



సున్నపురాళ్లపల్లె కన్యతీర్థం వద్ద స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాలు

- జేఎస్‌డబ్ల్యూ ఏపీ రాయలసీమ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఆదేశాలు జారీ
- ఏటా ఒక మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యం
- రెండో విస్తరణతో మరో మిలియన్ టన్నులు
- మొత్తం రూ.16,350 కోట్ల పెట్టుబడి

మైలవరం డ్యాం నుంచి 15 కి.మీ. పైపులైను ద్వారా సరఫరా చేయడానికి, ఎన్‌హెచ్ 67 నంబరు రోడ్డు కనెక్టివిటీకి నాలుగు లైన్ల రహదారి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కేంద్రంతో సంప్రదించి పీఎం గతి శక్తి పథకం కింద ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల స్టేషన్ల మధ్య ముద్దనూరు స్టేషన్‌ను కలుపుతూ 12 కి.మీ. రైల్వే లైను విస్తరణకు ఏపీ ప్రభుత్వం అంగీకరించడంతో పాటు కంపెనీ అందజేసే ముడిసరుకు ప్రణాళిక మేరకు సీ పోర్టుకు అనుసంధానం చేసేందుకున్న అవకాశాలను ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా పరిశీలించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అంతేగాకుండా సున్నపురాళ్లపల్లె వద్ద 1,100 ఎకరాలను ఎకరా రూ.5 లక్షల ప్రకారం అప్పగించేందుకు కూడా ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇది కాకుండా సున్నపురాళ్లపల్లె వద్ద రాయలసీమ స్టీల్‌ప్లాంటు ద్వారా టౌన్‌షిప్ ఏర్పాటు చేసేందుకు మరో 200 ఎకరాలను ఏపీఐఐసీ మార్గదర్శకాల ప్రకారం కేటాయించేందుకు కూడా అంగీకరించింది.

ఈ నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యు కంపెనీ మొదటి విడతగా రూ.4,500 కోట్లు పెట్టుబడితో ఏడాదికి ఒక మిలియన్ టన్నులను ఉత్పత్తిని, రెండో విడతో రూ.11,850 కోట్లు పెట్టుబడితో (మొత్తం రూ.16,350 కోట్లు) మరో మిలియన్ టన్నుల ఉత్పత్తిని చేసేందుకు జేఎస్‌డబ్ల్యు ప్రతిపాదించింది. రెండు విడతల్లో మొత్తం 2,500 మందికి ప్రత్యక్ష ఉపాధికి హామీ ఇచ్చింది. సెప్టెంబరు నాటికి అన్ని అనుమతులు పూర్తి చేస్తే 2026 జనవరిలో నిర్మాణాలు ప్రారంభించి 2029 మార్చి నాటికి పూర్తి చేస్తామని, 2029 ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభించేందుకు కూడా కంపెనీ ప్రతిపాదించింది. అదే విధంగా రెండో విడత విస్తరణను కూడా పూర్తి చేసి 2034 ఏప్రిల్ నుంచి ప్రారంభించనున్నట్లు జేఎస్‌డబ్ల్యు పేర్కొంది. ఈ మొత్తం ప్రతిపాదనలు పరిశీలించిన స్టేట్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (ఎస్ఐపీసీ) ఈ నెల 17న జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపిన దరిమిలా మొదటి విడత రూ.4,500 కోట్లతో పనులు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేస్తూ దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్: డీఆర్వో

కడప కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ఉదయం 9-30 గంటల నుంచి డయల్ యువర్ కలెక్టర్, 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు అర్జీలు సమర్పించి పరిష్కారం పొందాలని కోరారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించిన అర్జీలు ఏ దశలో ఎవరి వద్ద ఉన్నాయి ? సమస్యలు పరిష్కారమయ్యాయా ? లేదా ? అనే విషయాలను నేరుగా తెలుసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో తెచ్చిన 1100 నెంబరుకు ఫోన్ చేయవచ్చని డీఆర్వో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వాట్సప్ ద్వారా సమస్యలు పరిష్కారం

- విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ



విలేకరులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమణ

కడప ఎర్రముక్కపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వాట్సప్ ద్వారా విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవచ్చని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ఈ అవకాశం కల్పించామని, గాలులకు తెగిపడిన విద్యుత్ లైన్‌లకు స్వయంగా మరమ్మతులు నిర్వహించకుండా దూరంగా ఉంటూ సంబంధిత విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేయాలన్నారు. వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. 9440814264 అనే వాట్సప్ నెంబరుకు విద్యుత్ సమస్యల ఫొటోలు, ఫిర్యాదుదారుని పేరు, గ్రామం, మండలం, మొబైల్ నెంబర్ పోస్ట్ చేయాలని చెప్పారు. హెల్ప్‌డెస్క్‌లో ఉన్న సిబ్బంది సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారమయ్యే వరకు అనుసరిస్తారన్నారు. పై నెంబర్‌ను ఉపయోగించుకొని విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

1500 క్యూసెక్కుల నీరు విడుదల



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి ఆదివారం అధికారులు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మైలవరం రైతుల అవసరాల దృష్ట్యా రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున 2 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని, ప్రస్తుతం ప్రాజెక్టులో 13.9 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు అని వివరించారు.

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ్

కడప మారుతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల, నాయకుల అండదండలతో బీజేపీని గ్రామ స్థాయిలో సైతం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, అందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఆయన ప్రథమంగా తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన కడప జిల్లా పర్యటకు ఆదివారం విచ్చేశారు. ఈ మేరకు నగర ఆదిత్య ఫంక్షన్ హాలులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జె.వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కడప గడప నుంచి రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుడితే అంతా శుభం కలుగుతుందనే విశ్వాసంతో తొలిసారిగా జిల్లా పర్యటన చేపట్టినట్లు వెల్లడించారు. దేశం, ధర్మం కోసం బలిదానం చేసిన ఎందరో నాయకులు సేవలందించిన ఏకైక పార్టీగా బీజేపీకి పేరుందని, అలాంటి పార్టీని రాష్ట్రంలో ముందుండి నడిపించే అవకాశం తనకు దక్కడం పూర్వజన్మ సుకృతమన్నారు. రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి సర్కార్‌లో బీజేపీ భాగస్వామిగా వుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని, ఇందులో భాగంగా జిల్లాలోని కొప్పర్తిని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి పరిచేందుకు నిధులను కేంద్రం అందించిందన్నారు. అలాగే జాతీయ రహదారుల్లో భాగంగా బద్వేలు-నెల్లూరు ఎక్స్‌ప్రెస్ హైవేరోడ్డు నిర్మాణంతో పాటుగా కడప ఎయిర్‌పోర్ట్ కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా చేయనున్నామన్నారు. అలాగే కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పార్టీలో సముచిత స్థానం వుంటుందన్నారు. అనంతరం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో సత్తా చూపేందుకు సిద్ధంగా వున్నామన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా తట్టుకుని నిలబడే శక్తి ఆ భగవంతుడు తనకిచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా జిల్లాలోని ప్రాజెక్టులు అసంపూర్తిగానే వున్నాయని ఆరోపించారు. వాటిని త్వరగా పూర్తి చేస్తే ప్రజలకు, రైతులకు తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు.

నగరంలో భారీ శోభాయాత్ర

కార్యకర్తల సమావేశానికి ముందుగా నగర వై జంక్షన్ నుంచి భారీ శోభాయాత్ర చేపట్టారు. నగర పురవీధుల గుండా అప్సరా సర్కిల్, చిన్నచౌక్, పోలీస్‌స్టేషన్ మీదుగా ఆదిత్య కళ్యాణమండపం వరకు యాత్ర సాగింది. యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో పాటుగా బీజేపీ నాయకుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు వి.వి.చలపతి, గోసుల శ్రీనివాసులరెడ్డి, మునగా సతీష్‌కుమార్, బొమ్మన సుబ్బరాయుడు, బీజేవైఎం జాతీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



నగరంలో శోభాయాత్ర

వైఎస్ కుటుంబంతోనే సతీశ్‌రెడ్డికి ప్రాణహాని

- నిన్ను టార్గెట్ చేసేంత పరిస్థితి లేదు
- రాజమౌళి డైలాగులు సినిమాల్లోనే బాగుంటాయి
- మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబంతోనే సతీశ్‌రెడ్డికి ప్రాణహాని ఉందని, ఆయనను టార్గెట్ చేసే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. రాజమౌళి డైలాగులు సినిమాల్లో అయితేనే బాగుంటాయని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సతీశ్‌రెడ్డి వ్యంగ్య వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సతీష్‌రెడ్డి పార్టీ నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఆయన వెంట వెళ్లింది కేవలం 5శాతం కేడర్ మాత్రమేనని, మిగిలిన 95 శాతం కేడర్ తమతోనే ఉందన్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో పోటీకి బయపడి పారిపోయిన వ్యక్తి సతీశ్ అని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో సతీశ్ పేరును చంద్రబాబు పుణ్యాన తొలగించిన విషయం గుర్తుచేశారు. లోకేశ్‌కు సతీష్‌రెడ్డిని టార్గెట్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. 25 ఏళ్లు ఇన్‌చార్జిగా పనిచేసిన వ్యక్తి పార్టీ వీడిన తర్వాత తాము జగన్ మెజారిటీని తగ్గించామా లేదా గుర్తుతెచ్చుకోవాలని చెప్పారు. 'నీ సొంత మండలంలోనే కాదు నీ సొంత బూత్‌లో కూడా తనకు మెజారిటీ వచ్చింది వాస్తవం కాదా. లోకేశ్‌కు నిద్రలేని రాత్రులు అంటున్న నీకే నిద్రలేని రాత్రులు ఉన్నాయని, నీపై భౌతికదాడులు చేసే పరిస్థితి టీడీపీ వారికి లేదని పేర్కొన్నారు. నీకు ప్రాణహాని ఉండేది వైఎస్ కుటుంబం నుంచే అనే విషయం తెలుసుకోవాలన్నారు. రాజమౌళి డైలాగులు సినిమాలో బాగుంటాయని, వేల్పుల సంఘటనప్పుడు ఆ మీసం.. ఆ చిరునవ్వు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెండు ప్రశ్నలకు సూటిగా సమాధానం చెబితే నీ గురించి మాట్లాడడం మానేస్తామన్నారు. నీ హయాంలో జరిగిన ఐదు అసెంబ్లీ ఎన్నికలు, రెండు ఎంపీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని అంటున్నావు.. నిజమేనా ? వేల్పుల సంఘటనలో గన్‌మెన్ కాల్పులు జరిపాడా మీరే కాల్పులు జరిపారా ? సారాయి వ్యాపారం కోసం మీరు దౌర్జన్యం చేయలేదా' అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం, రెండుసార్లు మేయర్‌గా గెలిచిన వారి పక్కన కూర్చొని సతీశ్‌రెడ్డి మాట్లాడుతున్నారంటే వైసీపీ పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థమవుతోందన్నారు.

ప్రజలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

- ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రం సర్వనాశనం
- అభివృద్ధి వైపు కూటమి అడుగులు
- రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



ప్రజాసమస్యలు వింటున్న మంత్రి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజలను విస్మరించిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం కడప నియోజకవర్గంలోని 35వ డివిజనులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలు ఏ మాత్రం పట్టించుకోలేదని, అందువల్లనే ప్రజలు జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అడుగులేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్ల పాలన అంతా దోపిడీ, స్కాంలు, వేధింపులేనని, నీటిపారుదల ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వంలో పర్యావరణశాఖ మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్విరాన్‌మెంటు క్లియరెన్స్ తీసుకోకపోవడంతో రూ.75 కోట్లు జరిమానా విధించడం జరిగిందని, తిరుపతి ఉప ఎన్నికలకు దొంగ ఓటర్లను రప్పించారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే ఏపీలో జరిగిన లిక్కర్ స్కాం పెద్దదన్నారు. ఒక్క జంగారెడ్డిగూడెంలోనే నకిలీ మద్యం తాగి 25 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తరువాత ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గతంలో 3 వేలు పింఛను ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి వెయ్యి పింఛను పెంచేందుకు ఐదేళ్ల కాలాన్ని వినియోగించుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వృద్ధులకు వెయ్యి, వికలాంగులకు రూ.2వేలు, బెడ్‌రెస్ట్‌లో ఉన్న వారికి రూ.10వేల వంతున అధికంగా పెంచడంతో పింఛనుదారులకు భరోసా ఏర్పడిందన్నారు. అంతేకాకుండా ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు వుంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇక ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వివరించారు. కాగా కడప ఎమ్మెల్యే మాధవి పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మంత్రి కితాబునిచ్చారు. అనంతరం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడప నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, త్వరితగతిన వాటిని పరిష్కరించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇందుకనుగుణంగా రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిధుల నుంచి అనేక పనులు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్, డీసీఎంఎస్ ఛైర్మన్ జయప్రకాశ్, టీడీపీ నాయకులు తదితరులున్నారు.

నేడు జిల్లాలో 20 సూత్రాల ఛైర్మన్ పర్యటన

కడప కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ 28న సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన రోడ్డుమార్గాన కడప నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి 11కు గండికోట చేరుకోనున్నారు. 11-12 గంటల వరకు గండికోట ఫోర్ట్, పెన్నానది ప్రాంతాలను సందర్శిస్తారు. అనంతరం తిరిగి రోడ్డు మార్గాన కడపకు చేరుకొని మధ్యాహ్నం 3 -5 గంటల వరకు కలెక్టరేట్‌లో ఆకాంక్షిత జిల్లా అంశంపై కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. కార్యక్రమానంతరం ఆయన విజయవాడకు బయలుదేరి వెళతారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు కసరత్తు

- జిల్లాలో పెరగనున్న కేంద్రాలు
- ఒక్కో కేంద్రంలో 1200 మంది ఓటర్లే


7

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు కసరత్తు

- జిల్లాలో పెరగనున్న కేంద్రాలు
- ఒక్కో కేంద్రంలో 1200 మంది ఓటర్లే
- జాబితా నుంచి నాన్ రెసిడెంట్ ఓటర్ల తొలగింపు
- పూర్తయిన బీఎల్‌వోల శిక్షణ

ఎన్నికల పక్రియలో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోనుంది. బతుకుదెరువు కోసం వలస వచ్చిన రోహింగ్యాలు ఓటు హక్కు పొంది, దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ఇలాంటి ఓటర్లను జల్లెడ పట్టి ఏరి వేసే పక్రియకు కేంద్ర ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది.

కడప కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, నాన్ రెసిడెంట్ ఓటర్ల తొలగింపులకు సంబంధించి ఇప్పటికే బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆర్ఐ) పేరుతో జూన్ నెలలో షెడ్యూల్ విడుదల చేసి ప్రక్రియను ముమ్మరం చేశారు. అదే విధానం దేశవ్యాప్తంగా అమలు జరగనున్న నేపథ్యంలో కార్యాచరణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని మన రాష్ట్ర ఎన్నికల కమిషనరు వివేక్ యాదవ్ గత జూన్‌లో జిల్లా కేంద్రాలకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ఎన్నికల అధికారులు, సిబ్బంది స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు కసరత్తు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1200కు మించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విదానం పక్కాగా అమలు జరిగితే జిల్లాలో ఇపుడున్న 1968 పోలింగ్ కేంద్రాలకు తోడుగా. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మరో 500 వరకు పెరిగి 2400 పైగా పీఎస్‌లకు చేరుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.



జిల్లాలో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ముందస్తుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభించింది. కడప నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు ఒకడుగు ముందుకేసి ఇప్పటికే 287 పోలింగ్ కేంద్రాలను ఫిల్టర్ చేశారు. దాదాపు 50 పోలింగ్ కేంద్రాలను సరిదిద్దేందుకు సిద్ధమయ్యారు. 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు, పక్కా భవనాలు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వాటిలో 25 పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ భవనాలలోకి మార్చేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ ప్రోగ్రామ్‌కు సంబంధించి ఆగస్టు నెలలో షెడ్యూల్ విడుదల చేయనుండడంతో జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 2400 వరకు దాటొచ్చంటున్నారు. పెరగనున్న పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బీఎల్వోలు, ఎన్నికల రిటర్నింగ్, సహాయ అధికారుల ఖాళీలు భర్తీ చేయనున్నారు.

బీఎల్ఓలకు శిక్షణ పూర్తి

జిల్లాలో 16.62 లక్షల మంది ఓటర్లుండగా, 1968 పోలింగ్ కేంద్రాలు, అంతే స్థాయిలో బూత్ లెవల్ అధికారులు ఉన్నారు. వీరందరికీ ఎస్ఐఆర్ ప్రోగ్రాం కింద కలెక్టరేట్‌లోని సభాభవనంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి ఎంపిక చేసిన సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఆది చినవేమయ్య ఢిల్లీలో శిక్షణ పొంది జిల్లాలో మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. కాగా ప్రతి ఏటా స్పెషల్ సమ్మరీ రివిజన్ పక్రియ జరగడం ఆనవాయితీ. ఈ దఫా ఆ ప్రక్రియ ప్రారంభం నాటికి ఎస్ఐఆర్ ప్రోగ్రాం ద్వారా సేకరించిన సమాచారంతో పక్కా ప్రణాళికతో సవరణలతో జనవరి 1 నాటికి ఓటర్ల తుది జాబితా పక్కాగా రూపు దిద్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

రూ. 38.8 కోట్లతో గుంజన నదికి రక్షణ గోడ



గుంజన నది వద్ద పంతగానితో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

రైల్వేకోడూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గుంజన నదికి రక్షణగోడ నిర్మాణానికి రూ. 38.8 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం గుంజననది ప్రాంతా న్ని ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. గుంజన నదికి వరదల కారణంగా ప్రతి ఏటా నిరుపేదల ఇళ్లు కొట్టుకుపోతున్నాయని, దీంతో వారు ఇతర ప్రాంతాలకు వెళ్లి తల దాచుకోవాల్సి వస్తోందన్న విషయాన్ని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి స్పందించి పనులు అతి త్వరగా గుంజన నదికి రక్షణగోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతు రాజు నవీన్, నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజకు విరాళం అందిస్తున్న పబ్బతి రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు

చక్రాయపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యన్నదాన పథకానికి ఆదివారం రూ.1,01,116 విరాళం అందినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా పులివెందులకు చెందిన పబ్బతి రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం కృష్ణవేణమ్మ కుమారుడు దక్షిణామూర్తి ధర్మపత్ని లక్ష్మీప్రసన్న ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకుడు వర్తి కేసరిలకు అందించినట్లు తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి తీర్థ, ప్రసాదాలు అందించడం జరిగిందన్నారు.

వృక్షాల కూల్చివేతపై నోటీసులు జారీ



బాకరాపేట ఫారెస్ట్ బీట్ పరిధిలో విద్యుత్ సిబ్బంది కూల్చివేసిన వృక్షాలు

సిద్దవటం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ పనుల్లో భాగంగా బాకరాపేట ఫారెస్ట్ బీట్ పరిధిలో టేకు చెట్లను కూల్చి వేసిన విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయంపై ఆది వారం కడప ఫారెస్ట్ రేంజ్ అధి కారి ప్రసాద్ మాట్లాడుతూ కడప రేంజి బాకరాపేట బీట్ పరిధిలోని ఓ రైతు సాగు చేసిన పెద్ద పెద్ద వృక్షాలు, టేకు చెట్లను విద్యుత్ అధికారులు పూర్తిగా తొలగించారన్నారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం అందించక పోవడంతో వారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. అటవీ పరిధిలోని పంట పొలాల్లో, బీడు భూముల్లో, రైతు పంట పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు తొలగించరాదని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన వివరించారు.

కారు ఢీకొని ఒకరి మృతి

దువ్వూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలం సి. బయనపల్లి డాబా వద్ద ఆదివారం కారు ఢీకొని కె.మాబూషరీఫ్ (52) అనే వ్యక్తి మృతి చెందాడు. చింతకుంట గ్రామానికి చెందిన ఈ వ్యక్తి పెట్రోలు పట్టించుకుని నాలుగు రోడ్ల కూడలిలో బైక్‌ను యూటర్న్ తీసుకుని రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొందని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

బాలుడిపై వీధి కుక్క దాడి



గాయపడిన సుశాంత్

బద్వేలుటౌన్, జులై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుమిత్రానగర్‌లోని ప్రదీప్ పాఠశాల వద్ద ఆదివారం సుశాంత్ అనే బాలుడు వీధిలో ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసింది. బాలుడి కుడిచేతిని నోటితో పట్టుకుని ఈడ్చుకుంటూ వెళుతుండగా స్థానికులు గమనించి రక్షించారు. ఈ ప్రయత్నంలో మరో ఇద్దరిపై దాడి చేసింది. బాలుడి తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారు. మున్సిపాలిటీలో ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కలదాడిలో గాయాలపాలవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో వేర్వేరు ప్రాతాఆలకు చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేశారని ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, పెంచుపాడుకు చెందిన బాలాజీ నాయక్ భార్య శాంతమ్మ(38) కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందుతాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మందలించాడని నీరుగట్టువారిపల్లెకు చెందిన రమణ కుమారుడు అశోక్ (19) పురుగుల మందు తాగాడు. స్థానికులు అతనిని ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నాగార్జున (22) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రెఫర్ చేశారు

కారు, బైకు ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు

రాజంపేట టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కారును బైకు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ ఆదివారం సాయంత్రం బైక్‌పై వెళుతూ మండల పరిధిలోని బోయనపల్లె వద్ద కడప నుంచి తిరుపతి వెళుతున్న కారును ఢీకొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ కుళాయప్ప తెలిపారు.

యువతి అదృశ్యం



శశికళ

కలసపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తన అమ్మమ్మకు ఆరోగ్యం సరిగా చూసేందుకని ఇంటి నుంచి బయలుదేరిన యువతి మూడు రోజులైనా ఇంటికి చేరలేదంటూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలసపాడు ఎస్ఐ తిమోతి తెలిపిన వివరాల మేరకు ప్రకా శం జిల్లా కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామానికి చెందిన సగిలి శశికళ తన అమ్మమను చూసేందుకు ముద్దవారిపల్లెకు వెళతానని చెప్పి బయలుదేరిన ఆమె. మూడు రోజులైనా ఇంటికి చేరలేదు. అమ్మ ఇంటికి కూడా వెళ్లకపోవడంతో ఆమె తల్లిదండ్రులు సగిలి సర్వేశ్వర రావు, వేలాంగిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వా లని ఎస్ఐ తెలిపారు.

కారుబోల్తా.. నలుగురికి గాయాలు





బోల్తాపడిన కారు, అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తి

జమ్మలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తా పడడంతో నలుగురు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ప్రొద్దుటూరులోని మేదర వీధికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం జమ్మలమడుగు మండలం గండికోటను చూసేందుకు వెళ్లారు. సాయంత్రం ప్రొద్దుటూరుకు తిరిగి వెళుతుండగా గొరిగెనూరు- ధర్మాపురం గ్రామాల మధ్య కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న రాతి దిమ్మెలు ఢీకొని పొలంలో బోల్తాపడింది. ఈ ఘటనలో పసుపులేటి హేమంత్, ప్రదీప్ అనేవారితోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం లేదని జమ్మలమడుగు పోలీసులు తెలిపారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

జమ్మలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు కేటాయించడంపై ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికులు ఆదివారం ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడలో ప్రైవేటు సంస్థలకు గ్యారేజీ స్థలాలను అప్పగించడాన్ని రద్దు చేయాలని కోరారు. ఏఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిండెంట్ ఎంజీసీవో రెడ్డి, కాంతయ్య, గురుస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచ వృత్తులను పరిరక్షించాలి

- ఈశ్వరీదేవి మఠాధిపతి వీర శివకుమార స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మఠాధిపతి వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచ వృత్తులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడేందుకు విశ్వబ్రాహ్మణులందరూ ప్రయత్నం చేయాలని జగన్మాత ఈశ్వరీదేవి మఠాధిపతి వీరశివకుమారస్వామి పిలుపునిచ్చారు. జూలై 6న తెలంగాణలోని ఎల్‌బీనగర్‌లో ప్రారంభమై 22 రోజులపాటు కొనసాగిన విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య యాత్ర ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి మఠం చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర తొలి సభాపతి ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు బంగారు బాబు, హైదరాబాదు క్రైం బ్రాంచ్ ఏసీపీ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి మాట్లాడుతూ రానురాను విశ్వబ్రాహ్మణులు వారి నైపుణ్యాలను మరిచిపోతున్నారని, రాబోవు తరానికి కూడా చేతివృత్తులు నేర్పించాలని తెలిపారు. అనంతరం ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన రచయిత, క్రియాశీల విశ్వకర్మ కార్యకర్తగా విశ్వనాథుల పుష్పగిరి దశాబ్దాల కాలంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా పని చేస్తున్నాడని, దేశవ్యాప్త విశ్వకర్మ ఉద్యమం నిర్మించేందుకు పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈ పాదయాత్ర నిర్వహించారన్నారు. విశ్వబ్రాహ్మణులు సాంస్కృతికంగా పునర్వైభవం సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. బాపట్ల బీజేపీ అధ్యక్షుడు బంగారుబాబు , మధుసూదనచారి మాట్లాడుతూ దేశంలో సంస్కృతీ సంప్రదాయాలకు మూలస్థానంగా నిలిచిన దేవాలయాలకు విశ్వబ్రాహ్మణులే మూలకారణంగా నిలిచారన్నారు పాదయాత్ర ద్వారా విశ్వబ్రాహ్మణ సమస్యలపై పోరాటం సాగించడంలో విశ్వనాథుల పుష్పగిరి సఫలమయ్యాడని, విశ్వ బ్రాహ్మణులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యే సందర్భాన్ని సృష్టించాడన్నారు. విశ్వకర్మలు ఐక్యంగా నిల బడి తమ శక్తిని నిరూపించుకోవాలన్నారు. లక్ష్మీనారాయణ, కంజర్ల కృష్ణమూర్తి, సొల్లేటి ప్రభాకరచారి, బాల నరసింహచారి, రంజిత్, బుగ్గిర్ల సతీష్, రాజశేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకుందాం..

- ఏపీ మత్స్యకార నేత అర్జున్



సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్

కడప మారుతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న మత్స్యకారుల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకుందామని ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ అర్జున్ సూచించారు. ఆదివారం స్థానిక రాజీవ్ పార్క్ సమీపంలోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ అధ్యక్షతన రాయలసీమ స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాయలసీమ జిల్లాల్లోని వన్నెకుల క్షత్రియ, బెస్త తదితర మత్స్యకార కులాలకు వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కేటాయించడంతో పాటు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపత్ యోజన కింద ఇస్తున్న పథకాలలో సబ్సిడీ 40 శాతం నుంచి 80 శాతానికి పెంచాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తీర్మానం చేశామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అర్జున్ సమక్షంలో రాయలసీమ జిల్లాల కమిటీని ఎన్నుకున్నారు. ఆ మేరకు కడప జిల్లా అధ్యక్షుడుగా వై. శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడుగా బాలసుబ్రమణ్యం,ప్రధాన కార్యదర్శిగా హోళిసాయితోపాటుగా సీమ నాలుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మత్స్యకారులు పాల్గొన్నారు.

భారీ తేడాతో అనంతపురం విజయం

- చిత్తూరు-నెల్లూరు మ్యాచ్ డ్రా



కిరణ్‌కుమార్ ఆరు వికెట్లు



హర్ష (చిత్తూరు) 167పరుగులు



తనీశ్వర్ 102 పరుగులు

కడప స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్ 16 మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు 221 పరుగులు భారీ తేడాతో విజయం సాధించింది. అలాగే చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా..

కేవోఆర్ఎం మైదానంలో

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో మూడోరోజు బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 70.4 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 295 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. దీంతో రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 505 పరుగులు చేసినట్లయింది. ఇందులో దేవాన్ష్ 41 పరుగులు చేశారు. అనంతరం కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లోకి దిగి ఆట ముగిసే సమయానికి 49.1 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. దీంతో అనంతపురం 221 పరుగులతేడాతో విజయం సాధించింది. అనంతపురం బౌలరు కిరణ్‌కుమార్ ఆరు వికెట్లు తీసుకున్నాడు

ఏసీఏక్రికెట్ మైదానంలో

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో రెండో రోజు నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 18 పరుగుల మొదట ఇన్నింగ్స్ ఆధిక్యత లభించినట్లయింది. ఇదిలా ఉండగా ఓవర్ నైట్ స్కోరు 40 పరుగులతో మూడోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 99 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 414 పరుగులు సాధించింది. ఇందులో హర్ష 167 పరుగులు, తనీశ్వర్ 102 పరుగులు చేయడం విశేషం. ఎంఎస్ అహ్మద్ 83 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు





రన్నింగ్ చేస్తున్న క్రీడాకారులు, హైజంప్ చేస్తున్న యువకుడు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం ఉదయం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్, అండర్-18, అండర్-20 మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 100, 200, 400, 800 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమద్‌బాషా, వ్యాయామ సంచాలకులు నాగూర్, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, నాగేశ్వరరావు, దిలీప్, ఖాదర్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

ఆస్పత్రి ముందు ప్రైవేటు అంబులెన్స్‌ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అంబులెన్స్‌ల తొలగింపుతో ఖాళీగా ఆస్పత్రి పరిసరాలు

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణ శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రి ముందు ఉన్న అంబులెన్స్‌లు తొలగిం చారు. ఇకపై అక్కడ అంబులెన్స్‌లు నిలుప రాదని హెచ్చరించారు. అంబులెన్స్ డ్రైవర్లను టూటౌన్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

పుత్తాను పరామర్శించిన మంత్రి



పుత్తాను పరామర్శిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డిని మంత్రి రామానాయుడు ఆదివారం పరామర్శించారు. పుత్తా ఇటీవలే మోకాలు ఆపరేషన్ చేయించుకుని కోలుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కడపకు వచ్చిన మంత్రి పుత్తాను కలిసి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం శాసనసభ్యుడు పుత్తాచైతన్యరెడ్డి మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్, టీడీపీ నాయకులు తదితరులున్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి డిమాండ్‌చేశారు. ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 2024 నుంచి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మొత్తాలను గత కొంతకాలంగా చేయలేదన్నారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలను వివరించారు. ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, కార్యవర్గ సభ్యుడు వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెమో నెంబర్ 57ను అమలు చేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎస్టీఎఫ్ వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో నెంబర్ 57 ద్వారా పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన స్పందిస్తూ కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 2003 డీఎస్సీ వారికి మెమో నెంబర్ 57అమలు ద్వారా పాత పింఛన్ విధానం అమలయ్యే విధంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు.

పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యం

ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి



నూతన అధ్యక్షుడు సురేంద్రను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు తప్పకుండా ప్రాధాన్యం ఉంటుందని ఆదివారం వెల్లటూరు గ్రామంలో జరిగిన సింగిల్ విండో అధ్యక్షుడిగా ఎన్నికైన గొల్లయ్యగారి సురేంద్రా రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి,ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు,మౌలిక వసతులు,సంక్షేమ పథకాలను చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పుష్పలతా దేవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌లు మురళీ మోహన్,వేణు మాదవ్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి,నాయకులు కిషోర్‌రెడ్డి,అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే స్టీల్‌ప్లాంట్ కల సాకారం

పులివెందుల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ హయాంలోనే కడప స్టీల్‌ప్లాంట్ కల సాకారం అవుతుందని టీడీపీ ఎస్సీ సెల్ తొండూరు మండల అధ్యక్షుడు మిద్దె మురళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని సున్నపురాళ్లపల్లెలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. స్టీల్‌ప్లంట్ ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్ లిమిటెడ్ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టిందన్నారు.

దౌలతాపురం.. దాహం తీర్చలేరా..?



దౌలతాపురం వద్ద 20 ఏళ్ల క్రితం వేసిన బోరు

పదేళ్లుగా అడుగుతున్నా పట్టించుకుంటే కదా.. ●తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు ●పదిరోజులకు ఒకమారు పైపులు పగలుతుండడంతో అవస్థలు

చెన్నూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దౌలతాపురం గ్రామాన్ని తాగునీటి సమస్య వెంటాడుతోంది. బోరు వేసినా అందులో నీరు వస్తున్నా అవి సక్రమంగా అందడంలేదు. వేసిన పైపులు పదిరోజులకు ఒకమారు పగులుతుండడంతో వాటిని మరమ్మతులు చేసుకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది ఈ విషయమై గతంలో పలు మార్లు అధికారులకు తెలిపినా పట్టించు కోలేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పైపులు పగలడంతో బురదగా మారిన నీరు

మండలంలోని దౌల తాపురం (చక్కెర ఫ్యాక్టరీ ప్రాంతం) ప్రజల కోసం 1984లో ఓ బోరు వేశారు. గ్రామానికి సమీపంలో 500 మీటర్ల దూరంలో బోరు వేయడంతో అప్పట్లో ఆ బోరు నీళ్ల చక్కెర కర్మాగారం అవసరంతో పాటు దౌలతాపురం ప్రజల అవసరాలు తీర్చేవి. రోజులు జరిగే కొద్దీ నీరు తగ్గడం, ఆ నీరు కూడా కొద్ది వరకు సరిగా లేకపోవడంతో 14 ఏళ్ల పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు మొదట వేసిన బోరుప్రాంతానికి తగ్గు వైపు ఓ పదిమీటర్ల దూరంలో మరో బోరు వేశారు. అక్కడ నీరు బాగానే పడ్డాయి. ఇందుకోసం 12 హెచ్‌పీ మోటారు బిగించారు. ఆ మోటారు కెపాసిటీకి తగ్గట్లుగా పైపులు వేయకుండా కేవలం 3 ఇంచి పైపులు వేయడంతో మోటరు నుంచి వేగంగా వెదజల్లే నీటి వేగానికి పైపులు పదిరోజులకు ఒకమారు పగులుతున్నాయి. దీంతో పక్కనే నీరు ఉన్నా దాహార్తి తీరని పరిస్థితి ఉందంటూ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బోరును 20 ఏళ్ల క్రితం వేసినా పదేళ్లపాటు అంతో ఇంతో ఉపయోగపడ్డా చివరికి పలుమార్లు పైపులు దెబ్బతింటూ వచ్చాయి. పదేళ్ల క్రితం ఉన్న టీడీపీ పాలనలో గ్రామ ప్రజలు తమకు తాగునీటికి ఇబ్బందిగా ఉందని, పైపులు పగిలి ఎప్పుడుబడితే అప్పుడు నీరు రాకుండా పోతోందని ఒకవేళ పైపులు పగిలితే అందులోకి బురదనీరు ప్రవేసించి తాగేందుకు ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పదే పదే అప్పట్లో చెప్పడం జరిగింది .

పైపులు పగిలితే బురదనీరే..: పైపులు పగిలితే నీరంతాబయటికి రావడం, బురదనీరుపైపుల్లోకి వెళ్లడం షరామామూలైంది. దీంతో పదిరోజులకు ఒకమారు పైపులు పగలినప్పుడల్లా ప్రజలు బురదనీరే తాగాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ విషయమై స్థానిక ప్రజలే కొందరు పైపులు బాగు చేసుకునేందుకు నడుం బిగించి ఐదారుమార్లు మరమ్మతులు చేస్తున్నారు. అయితే ఆ మరమ్మతులు తాత్కాలికమే. ఒకచోట మరమ్మతులు చేస్తే మరో చోట పైపులు పగలడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం ఉన్న 3 ఇంచి పైపులు తొలగించి 4 లేదా 5 ఇంచి పైపులు వేయాలని పదే పదే కోరడం జరిగింది.

నిధులు కేటాయించినా పనులు జరగలేదు..: చాలా ఏళ్ల క్రితం ఈ పైపులైనుకు పైపులు మార్చాలని గతంలో నిధులు కేటాయించినా ఆ నిధులతో పనులు జరగలేదు సరికదా కేటాయించిన నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి.



మూడించుల పైపు

పదేళ్లనాడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులు మార్చేస్తామని చెప్పినా ఆ తరువాత మాత్రం ఏం జరిగిందో ఏమో పనులు మాత్రం జరగలేదు.

మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి

పైపులు పగులుతున్నాయి పగిలినప్పుడల్లా బురద నీరు వస్తోంది. ఆ నీరు తాగితే రోగాల బారిన పడుతున్నాం. వాంతులు, విరేచనాలతో పాటు జ్వరాలు వస్తున్నాయని చెబుతున్నాం, అయినప్పటికీ మా మాట వింటే కదా, గత వైసీపీపాలనలో పదే పదే అడిగాం పట్టించుకోలేదు. ఈ మారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళితే బాగు చేస్తారేమో చూద్దాం.

- తిరుపతిరెడ్డి, దౌలతాపురం

మార్చకపోతే నీరున్నా ఇబ్బందులే

20 ఏళ్లక్రితం వేసిన బోరుకు పైపులు మార్చండని అడుగుతునే ఉన్నాం. అప్పట్లో కాంగ్రెస్ పాలనలో పదే పదే అడిగాం. అయినా ఎవరూ స్పందించలేదు. తరువాత వచ్చిన ఎమ్మెల్యేను సైతం అడిగాం, స్పందన లేదు. ఇప్పుడు ప్రభుత్వం మారింది, ఈ పాలనలో చేస్తారనే నమ్మకం ఉంది.మోటారు సామర్థ్యానికి తగినట్లుగా పైపుల సామర్థ్యం పెంచాలి.

- ఖాసింవలి, దౌలతాపురం

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప సెవెన్ రోడ్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మెడికేర్ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైనట్లు డాక్టర్ మహబూబ్ అలీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో దాదాపు వంద మందికి పైగా ప్రజలకు ఉచితగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే లివర్ ఫైబ్రో స్కేన్ పరీక్షను కూడా ఉచితంగా చేయడం జరిగిందన్నారు. అందరికీ ఉచితం మందులు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, లివర్‌కి సంబంధించిన ఫ్యాటీలివర్ రాకుండా ఉండాలంటే మంచి ఆహారం తీసుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ శిబిరంలో అయేషా, గౌతమి, శిరీషారెడ్డి, భార్గవి, వైష్ణవి, సబిహా, మాధవి, మహిత, షాహిద్ పఠాన్,మెడికల్ రెప్‌లు పాల్గొన్నారు.

ఆశా యూనియన్ మహాసభలను జయపదం చేయండి

కడప మారుతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కడపలో ఆగస్టు 30, 31 తేదీలలో తలపెట్టిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేసేందుకు పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, కోశాధికారి అమ్ములు, శాంతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

కడప మారుతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు స్వీకరించి తొలిసారి జిల్లా పర్యటన నిమిత్తం విజయవాడ నుంచి కడపకు విచ్చేశారు. ఆయనను ఆదివారం స్థానిక కడప రైల్వేస్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జాతీయనాయకులు పనతల సురేష్, జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ మహిళా నాయకురాలు చేవూరి శారద తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

సీకేదిన్నె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలో వీరభద్రస్వామి, ఆంజనేయస్వామి, శివాలయం, తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

తెలుగుభాషా పరిరక్షణకు వినూత్న ప్రణాళికలు అవసరం

కడప కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా పరిరక్షణకు వినూత్న ప్రణాళికలు అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. నగర ఎర్రముక్కపల్లెలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర ప్రాంగణంలో ఆదివారం తెలుగు భాషా పరిరక్షణ... కార్యాచరణపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తెలుగుభాష పరిరక్షణ ఇంటి నుంచే ఆరంభించాలన్నారు. పిల్లలను ఆ దిశగా తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. అనంతరం వైవీయూ కులసచివులు (ఇన్‌చార్జ్) ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ తెలుగుభాషా అభ్యున్నతికి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రధానంగా వుంటూ పలు సాహిత్య కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు తెలుగుకు సంబంధించిన పలు రకాల పోటీలు నిర్వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆదోని ఎంఎల్‌ఏ పార్థసారథి, బీజేపీ నాయకుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం జాతీయ కార్యదర్శి పనతల సురేష్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ,కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, తదిరులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ రమణ

లింగాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల రూరల్ సీఐ ఎన్‌వీ రమణ హెచ్చరించారు. మండలంలోని వెలిదండ్ల గ్రామంలో ఆదివారం మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపుపై దాడులు చేసి 108 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న చెన్నకేశవరెడ్డిని అరెస్టు చేశామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో విశ్రాంత ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు

పెండ్లిమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990-95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.30 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరి యోగ క్షేమాలు తెలుసు కున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలను, చదివిన బడి,పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తియాప్ సేవలు వినియోగించుకోండి



శక్తియాప్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్

కడప క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్ మహిళలు, బాలికలు రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని రిమ్స్ పీఎస్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ అన్నారు. శక్తియాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి ఆదివారం సాయంత్రం కడప నగర శివార్లలోని శిల్పారామం సందర్శకులకు రిమ్స్ ఎస్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆపద సమయంలో మహిళలు బాలికలకు ఈ శక్తియాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో అందులో ఎస్‌ఓఎస్ బటన్ ,డయల్ 112 నెంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే వెంటనే మీ చెంతకు పోలీసులు చేరుకుని సమస్య తీరుస్తారన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



చక్రాయపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమక్షంలో వేంపల్లె, చక్రాయపేట మండలాలకు చెందిన 15 మంది బీజేపీలో చేరారు. ఆదివారం కడపలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె.రామచంద్రారెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వై.రవియాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజారెడ్డి, దశరథ, గంగిరెడ్డి, ప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కడపకు వెళ్లిన బీజేపీ కార్యకర్తలు



కడపకు బయలుదేరుతున్న బీజేపీ కార్యకర్తలు

వీరపునాయునిపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కడపకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ రానున్న సందర్భంగా ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు తులసినాయుడు ఆధ్వర్యంలో వందమందికి పైగా బస్సులలో కడపకు తరలివెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమావేశానికి హాజరవుతున్నామని మండల బీజేపీ అధ్యక్షుడు తులసినాయుడు తెలిపారు.



దేవునికడపలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సన్మానిస్తున్న ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి బాలక్రిష్ణయాదవ్

బోర్లకింద కళకళలాడుతున్న వరి

చెన్నూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖరీఫ్ సీజనులో బోర్ల కింద వరి కళకళలాడుతుంది. ఇప్పటికే వరినాట్లు పూర్తి కావడం, అడపా దడపా వర్షాలు కురియడంతో ఎలాంటి రోగాలు లేకుండా పెరుగుతోంది. మండలంలోని దౌలతాపురం,బయనపల్లె, కనుపర్తి, బలసింగాయపల్లె, గుర్రంపాడు, రామనపల్లె తదితర గ్రామాల్లో వరిని సాగు చేశారు. గత ఏడాది కన్నా ఈ మారు కాసింత ముందుగానే వరిసాగు చేపట్టారు.

ఇప్పటికి అయితే కేసీ ప్రధానకాల్వలో తప్ప మిగతా ఉప కాల్వలో నీరు ప్రవహించకపోయినా బోర్ల కింద మాత్రం వరి సాగు చేశారు. పైగా గత ఏడాదితో పోలిస్తే ఈ మారు కాసింత సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని చెప్పవచ్చు.



దౌలతాపురం వద్ద కళకళలాడుతున్న వరి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం



కె. శోభారాణి
ఎంఈవో, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి శోభారాణి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఫేస్ టు ఫేస్

పశ్న: స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటులో కొన్ని తక్కువ పాఠశాలలు కేటాయించినట్లు విమర్శలు ఉన్నాయి?

జవాబు: నిబంధనల మేరకు స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేస్తాం.

పశ్న: మండలంలోని విద్యార్థులందరికి పాఠ్యపుస్తకాలు అందాయా ?

జవాబు: మొదటి విడతలో 13,800 పుస్తకాలు పంపిణీ చేశాం. రెండవ విడతలో 20 సెట్ల పుస్తకాలు వచ్చాయి. పాఠశాలలకు అందజేస్తున్నాం.

ప్రశ్న: ప్రైవేటు పాఠశాలలో ఉచిత అడ్మిషన్లు ఎంత మంది విద్యార్థులకు ఇచ్చారు ?

జవాబు: మొదటి విడతలో 190 మంది, రెండవ విడతలో 34 మంది విద్యార్థులు చేరారు.

పశ్న: ఉపాధ్యాయుల బదిలీలు జరిగినా ఇంకా కొన్ని పాఠశాలలో కొరత ఉన్నట్లుంది ?

జవాబు: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలో వర్క్‌అగ్రిమెంట్‌చేస్తున్నాం.

పశ్న: కొన్ని పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు పనిచేయక విద్యార్థులు సాధారణ నీళ్లే తాగుతున్నారు?

జవాబు: సమస్య ఉన్న పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే రిపేర్లు చేస్తారు. నాడు-నేడు మొదటి విడత పాఠశాలలో మెకానిక్‌లను నియమించకపోవడంతో సమస్య ఉంది.

పశ్న: మధ్యాహ్న భోజన పథకం కోసం మండలంలో సెంట్రల్ కిచెన్‌షెడ్ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు.

జవాబు: ఖాదరాబాద్ జడ్పీ హైస్కూలులో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే చర్యలు

పోరుమామిళ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. ఆదివారం వాహనాలు తనిఖీ చేపట్టా రు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానా విధించారు. అనుమతి లేకుండా మద్యంబాటిళ్లు తీసుకెళుతున్న రమణయ్య అనే వ్యక్తిని అదుపులోకితీసుకుని 16 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వర్షం వస్తే ఆ రోడ్డు అంతే..?

●ఎక్కడ పడితే అక్కడ గుంతలు ●12 కి.మీ రోడ్డుకు 14మలుపులు ● ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు ● రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు

కాశినాయన జూలై27(ఆంధ్రజ్యోతి) ఓబుళాపురం-వరికుంట్ల రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. కొద్దిపాటి వర్షం వచ్చినా రోడ్డుపై నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. జ్యోతికి పోయే భక్తులు, 15 గ్రామాల ప్రజలు నిత్యం ఈరోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ వందల సంఖ్యలో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఈరోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. 3సంవత్సరాల క్రితం రూ.9 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో డబుల్ రోడ్డు మంజూరు కావడంతో అందరూ ఈరోడ్డుకు మహర్దశ పట్టిందనుకున్నారు. కానీ ప్రస్తుతం ఈరోడ్డు పరిస్థితి అనుకున్న దొక్కటి అయ్యింది ఇంకొక్కటి అన్నట్లుగా ఉంది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ సగంలోనే పనులు ఆపివేయడంతో రోడు పరిస్థితి ఎటూమారని విధంగా తయారైంది. 12 కిలోమీటర్ల పొడవున్న ఈరోడ్డుపై దాదాపు 14 మలుపులు ఉన్నాయి. దాదాపు రెండు సంవత్సరాల క్రితం వరికుంట్ల నుంచి మిద్దెల ఎస్సీకాలనీ వరకు 8 కి.మీ మేర పనులు జరిగాయి. పనులు చేసినప్పటికీ ప్రస్తుతానికి ప్రతి మలుపువద్ద ఎదురుగా వచ్చే వాహనం కన్పించనంతగా ముళ్లకంప రోడ్డుపైకి చొచ్చుకొనివచ్చింది. మలుపులవద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. దీంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కన్పించక తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయి. మరోవైపు మండల కేంద్రమైన నర్సాపురం మీదుగా ఓబుళాపురం నుంచి మిద్దెల వరకు పనులు నిలిచి పోయిన 4 కి.మీ రోడుపై ఎక్కడ పడితే అక్కడ అడుగు నుంచి రెండు అడు గులమేర గుంతలు ఏర్పడి చిన్న పాటి వర్షం వచ్చి నా కుంటను తలపించేలా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బం దులు పడుతున్నారు. ఎక్కడైనా ప్రధాన రోడ్లపై గుంతలు ఏర్పడితే సంబంధిత అధికారులు ముందు కొచ్చి కంకర పోసి ప్ర యాణికులు అసౌకర్యానికి గురి కాకుండా చూసేవారు. ఎందుకో ఈ రోడ్డు గురించి పట్టిం చుకోక పోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయిం చి మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటుతోపాటు కంప చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సాపురం- ఓబుళాపురం మధ్య నీరు నిలిచి కుంటను తలపిస్తున్న రోడ్డు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

రాజుపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాన రహదారులే కాకుండా గ్రామీణ రహదారులకు మహర్దశ కల్పించింది. ఇందులో భాగంగా రాజుపాళెం మండల పరిధిలోని అయ్యవారుపల్లె, గాడెగూడూరు , టంగుటూరు గ్రామాలను కలుపుతూ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో తారురోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం లేదని తెలపడంతో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నం ద్యాల వరద రాజులరెడ్డి సహకారంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కోటి 55లక్షలతో ఈ కొత్తరోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో మూడు గ్రామాలు కలపడంతో పాటు రైతన్నలు పంట పొలాలకు వెళ్లేందుకు కూడా ఆ రోడ్డు అనుకూలంగా మారింది. అదే విధంగా ఈ రోడ్డు నిర్మాణం లోనే వెంగలాయపల్లె గ్రామానికి రోడ్డు వేస్తే ఈ ప్రాంత ప్రజలు జమ్మలమడుగుకు పోయేందుకు తక్కువ కిలోమీ టర్ల వస్తుందని అన్నారు. ఈ రోడ్డునిర్మాణాన్ని టెక్నో కన్ స్ట్రక్షన్ కాంట్రాక్టర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పంచాయతీరాజ్ డీఈ లక్ష్మినారాయణ రెడ్డి తదితరుల అధికారులతో కలిసి ఈ రోడ్డును పరిశీలించారు.



టంగుటూరు తరురోడ్డును పరిశీలిస్తున్న డీఈ లక్ష్మినారాయణరెడ్డి

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



మాట్లాడుతున్న విరజానందస్వామి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ గీతాశ్రమంలో నగర గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవ కమిటీల నిర్వాహకులు, కుల సంఘాల నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రజలందరూ ఐకమత్యంతో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, డాక్టర్ దస్తగిరిరెడ్డి, శివనారాయణ, దండపాణి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో పదోన్నతి కల్పించాలి

మైదుకూరు రూరల్, జులై 27(ఆంధ్రజ్యోతి) :ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు విద్యాశాఖలో కూడా పదోన్నతిని కల్పించాలని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సంక్షేమ,విద్యా సహాయకుల సమావేశంలో రాష్ట్ర నాయకుడు సిద్దేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఉద్యోగుల ఇంక్రిమెంట్‌ల విషయంలో కూడా కొంతమంది అధికారులు జాప్యం చేస్తున్నారని, ఆ అధికారులపై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయరుద్ర,ఉపాధ్యక్షుడు సోనియా,జిల్లా సెక్రటరీ హర్షవర్ధన్‌రెడ్డి, చిన్న, బాలాజీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్‌చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో కాంట్రాక్టు లెక్చరర్లు ఆయనకు వినతి పత్రం అందజేశారు. రెగ్యులరైజేషన్ చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట జనార్దన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు నాగేంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జిలానీ, మహబూబ్‌బాష, రామకృష్ణ, చిన్నయ్య, రామమోహన్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బద్వేలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం మార్తోమానగర్‌లో ఆయన పర్యటించి డ్రైనేజీ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలని, చెత్త సేకరణ సకాలంలో సేకవరించాల ని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు రాకపోతే 9440126507 నెంబరుకు తెలియజేయాలని కమిషనర్ తెలిపారు.

వేంకటేశ్వరస్వామి రథం నిర్మాణానికి పూజలు



రథనిర్మాణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లక్ష్మిపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ రథం నిర్మాణానికి శ్రావణమాసం ఆరంభంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజర య్యారు. ఇందులో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, లక్ష్మినారాయణ హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, కాంట్రాక్టరు ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ సత్యసంజీవకుమార్, భక్తులు పాల్గొన్నారు.

కడపకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు




బ్రహ్మంగారిమఠం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాదవ్ జిల్లా పర్యటన సందర్భంగా బి.మఠం మండలం నుంచి అధ్యక్షుడు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు బయల్దేరి హాజరయ్యారు. ఈ సమావేశానంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిమ, కాలజ్ఞాన జీవిత చరిత్ర పుస్తకం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చంద్రకాంతం ఈశ్వరయ్య, విజయకుమార్, దిరసవంచ బీజేపీ నాయకులు తిరుపాల్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రమణ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ కడపకు విచ్చేసిన సందర్భంగా పోరుమామిళ్ల నుంచి బీజేపీ నాయకులు పల్లెంశెట్టిపండరి, నాగేంద్ర, వంకదారి జయరాం, రమణాచారి తదితరులు తరలివెళ్లారు. ఆదివారం వారు పోరుమామిళ్ల నుంచి వాహనాల్లో కడపకు తరలివెళ్లారు.

టీడీపీ నాయకుడ్ని పరామర్శించిన విజయమ్మ

పోరుమామిళ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కనుమర్లపూటి రామసుబ్బారావును వెంగమాంబ హైస్కూలు ఛైర్మన్ పుల్లప్ప నాయుడును బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరామర్శించారు. ఇటీవల పుల్లప్పనాయుడు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే రామసుబ్బారావు హైదరాబాదులో చికిత్స పొంది పోరుమామిళ్లలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం ఆమె వారిని పరామర్శించారు. ఆమెతో పాటు ఈ కార్యక్రమాల్లో డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, కూటమి నాయకుడు బొజ్జ రోశన్న, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, సాదనకారిరంతు, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, కొండా రామక్రిష్ణరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, నరసింహనాయుడు, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి మానవత సంస్థ సాయం



ఎర్రగుంట్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): కిడ్నీలు సక్రమంగా పనిచేయక డయా లసిస్‌తో నెట్టుకొస్తున్న వ్యక్తికి ఎర్రగుంట్ల మానవత ఆర్థిక సహాయం చేసింది. మండలంలోని వలసపల్లెకు చెందిన నంద్యాల వెంకటరమణకు రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అతని కుమారుడు కూడా చిన్నతనంలోనే పోలియో వచ్చి రెండు కాళ్లు పనిచేయకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో వుంది. ఈవిషయం తెలుసుకున్న మానవత ఎర్రగుంట్ల మండలశాఖ ఇంటి వద్దకు వెళ్లి సంస్థ తరు పున రూ.5వేలు వ్యక్తితంగా మరో రూ.1800 సభ్యులు అందించారు. కార్యక్రమంలో మానవత కమిటీ సభ్యులు డి.రఘురామిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ఉపేంద్రరెడ్డి, భాస్కర్, సతీష్, సురేష్, మేడారమేష్‌బాబు, జక్కుచెన్నక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోండి

పోరుమామిళ్ల జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ కమిటీ కన్వీనరు సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. ఆదివారం రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర ధరలు, వైద్యఖర్చులు కుటుంబ అవసరాలు పెరిగి ఉద్యోగ ఉపాధ్యాయులుతీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చంద్రహాసరెడ్డి, వాకా చంద్రశేఖర్, బీ.శ్రీనివాసులు, నారాయణరెడ్డి, ఎన్.శ్రీనివాసులు, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ సుపరిపాలనపై ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

పోరుమామిళ్ల జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌రెడ్డి ఆదేశాల మేరకు పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ప్రతి ఇంటికీ తిరిగి టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం ప్రజల్లో సూపర్ సక్సెస్ అయిందన్నారు. అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని, 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల గుంతలు పడ్డ రోడ్లన్నీ కూటమి ప్రభుత్వం వస్తూనేవాటిని ప్యాచ్ వర్క్ చేసి బాగు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

చాపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలన తొలి అడుగులో ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు అక్బర్‌వలి, బయపురెడ్డి, అక్బర్‌సలీం, దాసుమియా, మాబువలి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. పింఛన్లు, అన్నక్యాంటిన్లు, తల్లికి వందనం, పల్లె పండుగ వంటి తదితర అభివృద్ధి పనుల గురించి వివరించారు. ముఖ్యమంత్రి త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను మహిళలకు పంపిణీ చేశారు.

మైదుకూరు రూరల్‌లో : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక సీఎం చంద్రబాబు తొలి అడుగు అభివృద్ధి వైపు అని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిలు తుపాకుల రమణ, బండి అమర్‌నాథ్ పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డులో 93 వ బూత్ నెంబరులో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం టీడీపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో వారు ఇంటింటికి తిరుగుతూ తల్లివందనం,గ్యాస్ అమౌంట్ పడ్డాయా, లేదా అని విచారించారు. చంద్రబాబు పాలనపై అభిప్రాయాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ పసల తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆరోగ్యం కోసంనిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని ఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఎన్జీవో హోంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు హోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాజశేఖర్‌వర్మ, డాక్టర్ బీఎల్ఎన్.రెడ్డి, డాక్టర్ నాగశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి 156 మంది ఉద్యోగులకు బీపీ, షుగర్, గుండెకు సంబంధించి ఈసీజీ, టుడీఏకో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా మంది ఉద్యోగులకు బీపీ, షుగర్ ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో హోలిస్టిక్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ నరసింహారావు, సీఆర్‌వో ప్రతాప్, ఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బయ్య, సహ అధ్యక్షుడు సదాశివయ్యాదవ్, ఉపాధ్యక్షుడు మధు, శివ, జాయింట్ సెక్రటరీలు రాజశేఖర్, మహేశ్వరయ్య, నాగార్జున, ఈశ్వరరెడ్డి, జయమ్మ, సావిత్రమ్మ, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సంతకాల సేకరణ



పోరుమామిళ్లలో సంతకాల సేకరణ చేస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు/పోరుమామిళ్ల జూలై 27 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌మీటర్లు వద్దు, కరెంటు ఛార్జీలు తగ్గించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పోరుమామిళ్లలో సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు స్మార్ట్‌మీటర్లకు మద్దతు పలుకుతున్నారని, ఈ స్మార్ట్‌మీటర్లు వస్తే ప్రజలపై భారం పడుతుందన్నారు. 2019లో వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఆదానీ స్మార్ట్‌మీటర్లు బిగిస్తామంటే గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ స్మార్ట్‌మీటర్లు ఇంటికి బిగిస్తే పగలగొట్టండి అని పెద్దఎత్తున సభల్లో వేదికల్లో మాట్లాడారన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, సుబ్బారావు, ఇండ్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు. కాగా బద్వేలులో జరిగిన కార్యక్రమంలో స్మార్ట్‌మీటర్లు బిగించే కార్యక్ర మాన్ని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ లిబ రేషన్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ప్రజా వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో చంద్ర మోహన్‌రాజు, జకరయ్య, రామరాజు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో దువ్వూరు విద్యార్థుల ప్రతిభ



గోల్డ్‌మెడల్ సాధించిన చిన్నారి అవినాష్‌రాయల్

దువ్వూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో దువ్వూరు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూలు నుంచి పోటీల్లో పాల్గొన్నవారిలో అయిదు గోల్డ్‌మెడల్స్‌తోపాటు మూడు సిల్వర్, ఒక బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు మాస్టర్ మారుగాని సుధీర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 25 నుంచి విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో పోటీలు జరిగాయని ఇందులో పాల్గొన్న అవినాష్‌రాయల్, క్రాంతిప్రతాప్, కౌసిక్‌క్రిష్ణ, నవీన్‌కుమార్, గురుచైతన్య సబ్‌జూనియర్ విభాగంలో గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు తెలిపారు. నాగశ్రీచరణ్, శేషు నరసింహ, స్కందధృవన్‌రాయల్ సిల్వవర్‌మెడల్, శివగోవర్ధన్ బ్రాంజ్‌మెడల్ సాధించారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న ఆయా విభాగాల్లో సదరు క్రీడాకారులు ప్రతిభ కనపరచి ప్రశంసలు అందుకున్నారని వివరించారు.

ఆటో గంగమ్మకు చేయుతనందిస్తాం

కొండాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు ఎస్టీ కాలనీకి చెందిన ఆటో గంగమ్మకు చేయుతనందిస్తామని ఏకలవ్య ట్రైబల్ ఫేడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతులకొండయ్య తెలిపారు. గతంలో గంగమ్మ గురించి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని చదివి ఆటో గంగమ్మను కలిసినట్లు ఆయన తెలిపారు. ఆటో నడపుతూ, కుటుంబాన్ని పోషిస్తూ గంగమ్మ అందరికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. తమ ట్రైబల్‌ఫెడరేషన్ తరుపున గంగమ్మకు ఆటో కొనివ్వడం లేదా ఆర్థికంగా చేయుతనిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్‌ఫెడరేషన్ నేతలు సుబ్బరాయుడు, డేరాజ్యోతి లు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ ద్వారా వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్లకు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా వేతనాలు చెల్లించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ పేర్కొన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల పదోన్నతి ప్రక్రియ ఆలస్యమవుతోందని ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని అందువలన ప్రభుత్వం త్వరగా పదోన్నతులను పూర్తి చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెల్ఫేర్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని పేర్కొన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు సెలవుల కోసం ఎంపీడీవో, అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలని దీనికి బదులు ఒకరి వద్దనే సెలవుకు దరఖాస్తు చేసుకునే విధంగా నిబంధనలను మార్పు చేయాలని కోరారు.